ఘనంగా జగన్నాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో జగన్నాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలు బుధవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు ఈ పూజలు కొనసాగి శుక్రవారం ప్రతిష్ఠాపన జరుగుతుందని అర్చకులు రాజగోపాలచారి తెలిపారు. పూరీ నుంచి విగ్రహాలను తెప్పించామని, వాటిని వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. శుక్రవారం జరిగే ప్రతిష్ఠాపన పూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఢిల్లీ ధర్నాలో శంషాబాద్ కాంగ్రెస్ నేతలు



శంషాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ నేతలు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్‌పై తెలంగాణ రాష్ట్ర సర్కారు చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి ధర్నాలో పాల్గొన్న వారిలో శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ తదితరులు ఉన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి



మంచిరేవులలో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్

మణికొండ: అప్పుడే పుట్టిన బిడ్డలకు గంటలోపు ముర్రు పాలను తాగిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలవేణి అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా బుధవారం నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలవేణి మాట్లాడుతూ... తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆరు నెలల వరకు ఎలాంటి డబ్బా పాలు పట్టరాదని సూచించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర జీవితం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు సుధారాణి, నళిని, అనితలతో పాటు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

అలీకి బెస్ట్ హజ్ సర్వీసు అవార్డు



ఫయాజ్ అలీని సన్మానిస్తున్న దృశ్యం

శంషాబాద్: హైదరాబాద్ నుంచి హజ్, ఉమ్రాకు రికార్డు స్థాయిలో యాత్రలు నిర్వహిస్తున్న అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకుడు మహ్మద్ ఫయాజ్ అలీ బెస్ట్ హజ్ సర్వీసు అవార్డుకు ఎంపికయ్యారు. సౌత్ ఏషియన్ హజ్ డివిజన్ ఆధ్వర్యంలో త్వరలోనే ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. అమెరికాకు చెందిన మౌలానా హుసాముద్దీన్, ఉస్మాన్‌బిన్ మహాఫౌజ్, మిర్జాఖుద్రత్ నవాజ్‌బేగ్, హాఫిజ్ అహ్మద్ అబీబ్ తదితరులు ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాతో ప్రత్యేకంగా అభినందించారు.

వీధి కుక్కలతో బెంబేలు

పెరిగిపోతున్న కుక్కల దాడులు

- ఆస్పత్రుల బాట పడుతున్న ప్రజానీకం
- బయటికెళ్లేందుకు జంకుతున్న గ్రామీణులు
- చిన్నారుల పరిస్థితి ప్రాణాంతకం!



మదన్‌పల్లిలో వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

శంషాబాద్ రూరల్: గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కల దాడులతో ఊరి జనాలు బెంబేలెత్తుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులు కుక్క కాటుతో ఆస్పత్రుల పాలవుతున్నారు. శంషాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికం అవుతోంది. పశు వైద్య శాఖ గణాంకాల ప్రకారం.. మండలంలో సుమారు రెండు వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. అధికారిక లెక్కల కంటే కూడా గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులుగా దర్శనమిస్తున్నాయి. వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటేనే జనం జంకుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.




రోడ్ల పక్కన పారబోసిన మాంసం వ్యర్థాలు, మదన్‌పల్లిలో కుక్కకాటుకు గురైన బాలుడు (ఫైల్)

పెరుగుతున్న బాధితులు

- మదన్‌పల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం నలుగురిపై కుక్కలు దాడి చేశాయి. అందులో ఓ బాలుడికి తీవ్ర గాయాలవగా.. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.
- మండల పరిధిలోని పాల్మాకుల, పెద్దషాపూర్, ముచ్చింతల్, మదన్‌పల్లి గ్రామాల్లో కుక్కకాటుకు ఎక్కువగా బలవుతున్నారు.
- పెద్దషాపూర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూన్‌లో 58, జులైలో 84 కేసులు నమోదు కాగా.. ఈ నెలలో ఇప్పటి వరకు 39 మందికి కుక్కకాటుతో గాయాలయ్యాయి.
- నర్కూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలలో 20 వరకు ఈ తరహా కేసులు నమోదు అవుతున్నాయి. కుక్క కాటుతో ప్రాణంతకమైన రేబిస్ వ్యాధికి గురవుతుంటారు. సకాలంలో వ్యాక్సిన్ వేసుకోకపోతే పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంటుంది.

బ్రీడింగ్ సీజన్ కావడంతో...

- కుక్కలకు జులై నుంచి సెప్టెంబరు నెలలు బ్రీడింగ్ సీజన్ ఉంటుంది. వీటి కలయిక సమయంలో వాటిని విడదీయడానికి ప్రయత్నించినా.. అటుగా ఎవరైనా వెళ్లినా.. దాడికి యత్నిస్తుంటాయి.
- పచ్చి మాంసానికి అలవాటు పడిన కుక్కలు.. ఆహారం దొరకని సమయంలో దాడులు చేస్తుంటాయి. ముఖ్యంగా చిన్నారుల వద్ద పచ్చి మాంసం వాసన వస్తుండటంతో వారినే కరుస్తుంటాయి.
- కుక్కలు ఉన్న చోట నుంచి పరుగెత్తినా.. వాటిని బెదిరించినా దాడికి దిగుతాయి.

మాంసం వ్యర్థాలతో...

- గ్రామాల్లో మాంసం వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్లు, వీధుల పక్కన పారబోస్తున్నారు. ముఖ్యంగా చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను వేస్తుండటంతో కుక్కలు వీటినే ఆహారంగా తీసుకుంటున్నాయి. ఆకలి వేసినప్పుడు ఆహారం దొరకకపోతే దాడులు చేస్తున్నాయి.
- మాంసం వ్యర్థాల పారబోతను అరికట్టడంతో పాటు వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించేలా పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి



గ్రామాల్లో వీధి కుక్కలను అరికట్టడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. వీటి కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు. చిన్నారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.
– వెంకటేష్, వార్డు మాజీ సభ్యుడు, మదన్‌పల్లి, శంషాబాద్

జాగ్రతలు పాటించాలి



కుక్క కాటుకు గురైతే.. వెంటనే సబ్బుతో గాయమైన చోట శుభ్రంగా కడగాలి. తర్వాత ఆస్పత్రికి తీసుకొస్తే గాయం తీవ్రతను బట్టి వ్యాక్సిన్ వేస్తాం. చాలా మంది అవగాహన లేక.. గాయమైన చోట పసుపు రాస్తుంటారు. ఇలా చేయకుండా సబ్బుతో కడగాలి. కుక్క కరిచిన తర్వాత వ్యాక్సిన్ వేసుకోవడం కాకుండా.. ముందు జాగ్రతగా కూడా ప్రీ బైట్ వ్యాక్సిన్ వేసుకుంటే చాలా మంచింది.
– డాక్టర్ దివ్యశ్రీ, వైద్యాధికారి, నర్కూడ, పీహెచ్‌సీ

కుక్కలకు టీకా వేయించాలి



వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించడానికి చర్యలు చేపడితే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చు. వీధి కుక్కలను పట్టి తెస్తే.. వ్యాక్సిన్ వేయగలుతాం. ఇక పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా ఏడాదికి ఒకసారి వ్యాక్సిన్ వేయించాలి. వీధి కుక్కలకు పుట్టిన పిల్లలకు వ్యాక్సిన్ వేయించడానికి గ్రామస్తులు చొరవ తీసుకోవాలి. కుక్కలు ఉన్న చోట నుంచి వెళ్లేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలి. వాటిని భయపెట్టకూడదు.
– డాక్టర్ శేఖర్, పశువైద్యాధికారి, శంషాబాద్

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9 గంటలకు టీచర్స్ కాలనీ, చింతల్‌బస్తీలలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. ఆయా కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ యువ నేత రగడంపల్లి శ్రవణ్ కోరారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించేందుకు తమవంతు బాధ్యతను తీసుకుంటున్నామని ఎస్ఐఎస్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియేస్ మంగళం ఆంటోనీ తెలిపారు. అత్తాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఐఎస్ తన సీఎస్ఆర్ కార్యకలాపాల విస్తరణగా ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి మద్దతు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, వసతుల కల్పనకు రూ. 8 లక్షలను కేటాయించారన్నారు. పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ సంస్థతో భాగస్వామ్యంలో 2024లో స్వీకరించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. గత సంవత్సరం చేపట్టిన మొదటి వార్షిక అభివృద్ధి పనుల్లో తరగతి గదుల పునరుద్ధరణ, శుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంవత్సరం కొత్త తరగతి గది నిర్మాణం, కొత్త బెంచీల ఏర్పాటు, డిజిటల్ లెర్నింగ్‌కు మద్దతుగా స్కూల్ అడ్మినిస్ట్రేషన్ కోసం ల్యాప్‌టాప్‌లు, చదువుపై ఆసక్తిని పెంచేందుకు పూర్తిస్థాయిలో గ్రంథాలయ గది ఏర్పాటు చేయనున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని రాణించాలని సూచించారు. విద్యాధికారి శంకర్‌రాథోడ్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న డీఈఓ

- మెరుగైన వసతులు కల్పిస్తున్న ప్రభుత్వాలు
- పెరుగుతున్న దాతల ఉదారత
- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు దాతలు ముందుకు వస్తున్నారని, వాటన్నింటిని సద్వినియోగం చేసుకుని ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఆయన గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఇండోర్ స్పోర్ట్స్ గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... మణికొండ ఉన్నత పాఠశాలలో కొంత మెరుగ్గా ఫలితాలు వస్తున్నా అవి సరిపోవని, సరిగా చదవని విద్యార్థులను గ్రేడింగ్ చేసి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్నందున ఈ సంవత్సరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు రావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు వాటి నాణ్యతపై విద్యార్థులతో మాట్లాడారు. తమ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ లేక పోవటంతో ఏడాదిగా విద్యార్థులకు కోడి గుడ్లను అందించ లేక పోతున్నామన్నారు. త్వరలోనే దాన్ని మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులు భోజనం నాణ్యంగా ఉంటుందని, వచ్చిన వంటకాలను అన్నింటినీ వడ్డించటం లేదన్నారు. దాంతో ఆయన అన్ని రకాల వంటకాలను తప్పనిసరి వడ్డించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలని కోరటంతో ఇప్పటికే మరో 11 మందిని మణికొండకు బదిలీ చేశామని, త్వరలోనే వారు వచ్చి చేరుతారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు కె.రామకృష్ణారెడ్డి, బి.పద్మారావు, విద్యాకమిటీ చైర్మన్ యాలాల నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు వి.బాల్‌రెడ్డి, కె.కుమార్, లక్ష్మీశ్రీ, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

బండ్లగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బీజేఎంసీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, పీబీఈఎల్ సిటీ, పరిసర ప్రాంతాల నివాసితులతో కలిసి కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. మెయిన్ రోడ్ నుంచి పీబీఈఎల్ సిటీ వరకు బీటీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైష్ణవి ఒసిస్ పక్కన ఉన్న లేన్ నుంచి మూసీ వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పని, ఇది లోనెట్టా విలాస్ వద్ద సమస్యలు సృష్టిస్తుందన్నారు. వివిధ కాలనీలలో వీధి దీపాల సంబంధిత విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యలపై కమిషనర్‌కు విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'సందడి చేసిన పూర్వ విద్యార్థులు'



పాఠశాలకు ఫ్యాన్‌లు, అమ్మారాను అందజేస్తున్న రామకృష్ణ

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు విద్యార్థులు ఒకే వేదికపై చేరి సందడి చేశారు. ఈ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన రామకృష్ణ ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తనవంతు సాయంగా తాను చదివిన పాటశాలకు రూ. 25 వేల వ్యయంతో ఏడు ఫ్యాన్‌లను, మూడు అల్మారాలను అందజేశారు. రామకృష్ణ సేవా నిరతికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పీఆర్‌టీయూ రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్, ఉపాధ్యాయులు సాయిప్రసాద్‌రావు, రజియాబేగం, సుజాత, పి.డి.రంగారెడ్డి తదతరులు అభినందించారు.

టీటీ అండర్-15 టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న నరేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ గ్రూప్‌లో దివంగత స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి స్మారక తెలంగాణ రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో అండర్-15 విభాగంలో సెమీఫ్స్, ఫైనల్స్ జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా టెబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నరేందర్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర టెబుల్ టెన్నిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, మహవీర్ కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజ్‌రెడ్డి విజేతలకు నగదు పారితోషకం, షీల్డ్స్ బహూకరించారు. అండర్-15 విజేతలుగా మొదటి బహుమతి ప్రామస్, రెండవ బహుమతి అర్జున్, మూడవ బహుమతి విలోహిత్, నాల్గొవ బహుమతి హరీయాన్‌లు గెలుపొందారు. ఈ సందర్భంగా ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 9, 10వ తేదీలలో మెన్, ఉమెన్ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు.

'మురుగునీటిని చెరువులో కలపొద్దు'



నెక్నాంపూర్ చెరువును పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు

మణికొండ: వర్షపు నీరు ఉండాల్సిన చెరువులో మణికొండ మున్సిపాలిటీతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని చేర్చటంతో దుర్గంధంగా మారి ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నాయకులు ఇబ్రహీంబాగ్ (నెక్నాంపూర్) పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెక్నాంపూర్ చెరువు అభివృద్ధికి రూ. 22.65 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. కొంత మేర పనులు జరిగినా పూర్తి కాకపోవటంతో ఎక్కడి సమస్య అక్కడే అన్న చందంగా ఉందన్నారు. చెరువులో మురుగు నీరు కలవకుండా ఏర్పాటు చేయాల్సిన ఎస్‌టీపీని స్థానికులు వ్యతిరేకించటంతో పరిస్థితి మొదటికి వచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మూసీని సుందరీకరణ చేస్తామని ప్రకటిస్తున్నందున నెక్నాంపూర్ చెరువులో మురుగు నీరు చేరకుండా చేయాలన్నారు. చెరువు అభివృద్ధి, ప్రజల సమస్యపై గత మున్సిపాలిటీ పాలక కమిటీ ఒక్క రోజు కూడా చర్చించక పోవటం విడ్డూరమన్నారు. పార్టీ నాయకులు కె.ధన్‌రాజ్, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, జి.నరేందర్, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, ఆరీఫ్, సుమ నళిని, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ కార్డులంటూ మోసగిస్తున్న ప్రభుత్వం'

మైలార్‌దేవ్‌పల్లి: కొత్త రేషన్ కార్డులు ఇస్తామంటూ ప్రజలందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచుకుంటూ సామాన్య ప్రజలకు మొండి చేయి చూపారని ఆరోపించారు. గత మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తే కనీసం స్థానిక డివిజన్ కార్పొరేటరైన తనకు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని విస్మయం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనపై, స్థానిక ఎమ్మెల్యే, అధికారులపై ఘాటైన వాఖ్యలు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు వచ్చి రేషన్ కార్డులను పంపిణీ చేసినప్పుడు కనీసం ప్రొటోకాల్ ప్రకారం తనకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రగా ఆయన అభివర్ణించారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలా నిర్వహించుకోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు.

జయశంకర్ సార్.. జోహార్



మైలార్‌దేవ్‌పల్లిలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ మలిదశ ఉద్యమ రథ సారథి కేసీఆర్‌కు నిత్యం అండగా ఉంటూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసేందుకు కడదాకా పోరాడిన ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నేతలు రాముయాదవ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, రాజేష్‌యాదవ్, ఏడ్లకాడి సూర్యం, జగదీష్, జి.రాజు, ఈర్లపల్లి ప్రవీణ్, వెంకటరమణ, ఆర్.కుమార్, జగన్, బాలరాజు, దుర్గప్రసాద్, సునీల్, మల్లేష్, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, రాజు, అనిల్ కుమార్, జనార్దన్, నరహరి, సుమన్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నార్సింగిలో మార్కెట్‌లో చైర్మన్‌లు

నార్సింగిలో...

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. నార్సింగి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీల చైర్మన్‌లు కె.వేణుగౌడ్, టి.మల్లేష్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదువుకోవాలి

పాల్మాకులలో కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

శంషాబాద్ రూరల్: సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న వసతి సౌకర్యాలను వసతి గృహంలో పరిశీలించారు. ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లోని పలు ప్రశ్నలను విద్యార్థినిలను అడిగారు. ఆంగ్లం సబ్జెక్టులో వెనకబడడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏఎన్ఎం, ఎస్ఓ, గ్రాఫ్ట్, కంప్యూటర్ ఆపరేటర్ ఉపాధ్యాయులు లేరని విద్యార్థినిలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లో ఆయా పోస్టుల్లో సిబ్బంది నియామకం చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే నేటి పోటీ ప్రపంచంలో రాణిస్తామన్నారు. పాఠశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూర్చుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువు ఒక ఆయుధమని.. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళికతో చదువుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్‌దత్ ఉన్నారు.



కస్తూర్బా గాంధీ విద్యాలయం వసతి గృహంలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి